క్లుప్తంగా

డ్రెయిన్ల నిర్మాణం ప్రారంభించండి



రోడ్డు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: మున్సిపాలిటీ 8వ వార్డులో ఉన్న జయప్రకాష్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల రోడ్డును మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు మంగళవారం పరిశీలించారు. మరమ్మతులు చేపట్టిన తర్వాత రోడ్డు ఎలా ఉందని తెలుసుకునేందుకు అక్కడికి వచ్చిన ఆయన డ్రెయిన్‌ల నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు బొద్దల సత్యనారాయణ, రాజగోపాల నాయుడు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

రాజాం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఎంఈవో ప్రవీణ్ కుమార్ కోరారు. మండలంలోని ఇల్లంనాయుడువలస గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆయన మంగళవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ సమితి రాజాం శాఖ వారు ఇచ్చిన మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇదే విషయమై ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశామన్నారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు యువత ముందుకు రావాలన్నారు.

భారీ వర్షం



బొబ్బిలి రైల్వేస్టేషన్ జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

బొబ్బిలి: పట్టణంతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అరగంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ఉబాలు(ఉడుపులు/వరినాట్లు వేయడం) జరగని చోట వరినాట్లు వేసుకునేందుకు ఈ వర్షపు నీరు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



అంబకండిలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: వరి సాగు చేస్తున్న రైతులంతా తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని అంబకండి, ఉంగరాడ, గుళ్లపాడు గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమికి సంబంధించి 1-బి, ఆధార్‌కార్డు, ఫోన్ నంబరును అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు ఇస్తే ఈ-క్రాప్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని 25 రైతు సేవా కేంద్రాల్లోనూ ఈ ప్రక్రియ నిర్వహించడం జరుగుతోందన్నారు.

రికార్డుల తనిఖీ

రాజాం సిటీ: గ్రామాల్లో నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని చీపురుపల్లి డీఎస్పీ ఎ.శ్రీనివాస చక్రవర్తి సూచించారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన.. రేగిడి, వంగర, సంతకవిటి ఎస్‌ఐలతో సమీక్షించారు. చార్జిషీట్‌లు, కేసుల నమోదు వంటి పలు అంశాలపై చర్చించి, రికార్డులు తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గస్తీ ముమ్మరం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఉపేంద్రరావు, ఎస్‌ఐలు శ్రీనివాస్, జనార్దన్, షేక్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి

- సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో ఎంపీడీవో మధుసూదనరావు



రామభద్రపురం: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరావు



బొబ్బిలి రూరల్: మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

తెర్లాం: గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండోరోజు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు హాజరైన ఆయన.. గ్రామాల్లో పారిశుధ్య పనులు, చెత్త నుంచి సంపద సృష్టి, ఈ-పంచాయతీ తదితర కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని సర్పంచ్‌లకు తెలిపారు. అలాగే ప్రజారోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నీలిమ, ఎంపీడీవో కార్యాలయ ఏవో డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్రే కీలకం

రామభద్రపురం: గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండోరోజు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల ఏర్పాటు, పంచాయతీ పాలనా తీరు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం నాయుడువలస గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలింపజేసి, ఘనవ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, అభివృద్ధి పథంలో గ్రామాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం..

బొబ్బిలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని యువత చెడు వ్యసనాల బారినపడకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు మంగళవారం వెళ్లిన ఆయన.. గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీ వంటి మాదకద్రవ్యాలకు యువత ఎక్కువగా బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుంచే ఈ చెడు అలవాట్లకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అంతకుముందు ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రత, అభివృద్ధిపై దృష్టి సారించడంతో పాటు ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని తెలిపారు. శిక్షణ తరగతుల్లో భాగంగా మండలంలోని పారాది గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై ఎంపీడీవో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిఅప్పారావు పేరు తొలగింపు దుర్మార్గం



మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: తాటిపూడి జలాశయానికి గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెట్టిన గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును ఇప్పటి కూటమి ప్రభుత్వం తొలగిస్తుండడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఇదే విషయమై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపే లక్ష్యంగా పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. విశాఖ ప్రజల తాగునీరు, ఇక్కడి ప్రజల సాగునీటికి అలుపెరగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బుచ్చిఅప్పారావు అని ఆయన పేరును ఇక్కడి ప్రజల విజ్ఞప్తుల మేరకే అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టుకు పెట్టారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి ఆనవాళ్లు లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ దాడులను ప్రోత్సహిస్తున్న తీరును ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. ప్రజలు ఓపిగ్గా ఉన్నంతవరకే వారి ఆటలు సాగుతాయని, వారు ఒక్కసారి తిరగబడితే కొట్టుకుపోతారన్నారు. ఇప్పటికైనా ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

పరామర్శ



జానకమ్మను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కలిశెట్టి సతీష్ భార్య జానకమ్మను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఆమె విద్యుత్ ప్రమాదానికి గురై, ప్రస్తుతం కోలుకుంటుండగా, విషయం తెలుసుకున్న ఆయన వారి ఇంటికి వెళ్లి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, ఎంపీటీసీ కడగల రాంబాబు, సర్పంచ్‌లు వాకముళ్ల చిన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

సెప్టెంబరు 1 నుంచి భవానీ దీక్షలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి భవానీ దీక్షలు ప్రారంభించనున్నామని ఆలయ ధర్మకర్త, గురుభవానీ వానపల్లి నర్సింగరావు, అర్చకులు రామాయణం శ్రీనివాసశర్మలు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఆలయ 35వ వార్షికోత్సవంలో భాగంగా సెప్టెంబరు 1న మండల దీక్ష, 22న అర్ధ మండల దీక్షలకు సంబంధించి, మాలధారణ చేయనున్నామన్నారు. అక్టోబరు 3 నుంచి 11వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు, 12న అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుందన్నారు.

అప్రమత్తతతో మెలగాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: బాలికలు అప్రమత్తతతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని గురవాం గ్రామ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాలలు, మహిళల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం బాలికలు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలు రోజురోజుకూ పెరిగిపోతుండడం విచారకరమన్నారు. ప్రతిఒక్కరూ తమ కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. అందరూ ఆదర్శవంతమైన జీవనం సాగిస్తే సమాజంలో దుర్మార్గపు ఘటనలకు చోటుండదన్నారు. ఎవరైనా ఎవరి కారణంగానైనా ఏ విధమైన ఇబ్బందులు పడినా వెంటనే పోలీసులను ఆశ్రయించి, రక్షణ పొందాలన్నారు. కోర్టుల ద్వారా కూడా న్యాయం చేయడం జరుగుతుందన్నారు. బాలికలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. ఇంటికి దూరంగా ఉండి చదువుకుంటున్న విద్యార్థినుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌వో పి.సావిత్రి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, న్యాయవాదులు ఎం.శ్రీనివాసరావు, జి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

వంగర: ఏనుగుల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ కోరారు. మండలంలోని వీవీఆర్ పేట పొలాల్లో తిష్టవేసిన ఏడు ఏనుగుల గుంపు అక్కడి మొక్కజొన్న, చెరకు, వరి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఎంపీపీ.. ఏనుగుల దారి మళ్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే ఉన్నతాధికారులు పొలాలకు వచ్చి, పంటనష్టం అంచనా వేసి, బాధిత రైతాంగానికి న్యాయం చేయాలన్నారు.

ఆటో, బైక్ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు

బొబ్బిలి రూరల్: మండలంలో పిరిడి గోకుల్ కళాశాల వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం సాయంత్రం కొండదేవుపల్లి గ్రామానికి చెందిన రంభ వెంకటరమణ, అప్పలస్వామిలు బైక్‌పై బొబ్బిలి వెళ్తుండగా అంపావల్లి గ్రామానికి చెందిన గోకుల్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ, అప్పలస్వామి తీవ్రంగా గాయపడ్డారు. వారిని బొబ్బిలి సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

మండాకురిటిలో 'పొలంబడి'

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయంలోని మెలకువలను ఏవో పైల నవీన్ వివరించారు. ఏదైనా పంట సాగుకు సన్నద్ధమైనప్పుడు ఏ రకమైన నేల ఏ పంట పండించేందుకు అనుకూలమో తెలుసుకోవాలన్నారు. నేలసారం అనుసరించి పంట వేసుకుంటే అధిక దిగుబడులు రావడానికి అవకాశం ఉంటుందన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. పంటలు తెగుళ్ల బారినపడితే రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు పి.తవిటినాయుడు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో పంట తెగుళ్ల, వాటి నివారణ చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు.

దోమల నివారణ మందు పిచికారీ

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి ఆలయ కాలనీ, ఎగువ, దమ్మా, వజ్జి వీధుల్లో దోమల నివారణ మందు మంగళవారం పిచికారీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగునీటి నిల్వల్లో పెరిగే దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు



విద్యార్థుల దంతాలు పరీక్షిస్తున్న వైద్యురాలు లావణ్య

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. వికాస తరంగణి రాజాం శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దంత వైద్యురాలు లావణ్య మొత్తం 128 మంది విద్యార్థుల దంతాలు పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పలు ఆరోగ్య సూచనలు చేశారు. అన్నం తినే ముందు, తర్వాత నోటిని శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ఏ చిన్నపాటి దంత సమస్యతో బాధపడినా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్ కుమార్, వికాస తరంగణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు ఎం.మహేశ్వరరావు, చీడి జగన్నాథం, సత్యనారాయణ, పి.మధుసూదనరావు, శ్రీలక్ష్మి, కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండల కేంద్రంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు.. ప్రతీ విద్యార్థి ఆరోగ్యం క్షుణ్ణంగా తనిఖీ చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. బయట తినుబండారాలు తినవద్దని, ప్రతిరోజూ అన్నం తినే ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, వేడివేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలు తినాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఎంపీడీవో మధుసూదనరావును సన్మానిస్తున్న సర్పంచ్‌లు



వంగర: ఎంపీడీవో సాల్మాన్‌రాజ్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, తదితరులు



రామభద్రపురం: ఎంపీడీవో ఈశ్వరమ్మను సత్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు

తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.మధుసూదనరావును మండలంలోని పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సన్మానించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చిన ఆయన మండలంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి కృషి చేశారని ప్రశంసించారు. ఎన్నికలప్పుడు వచ్చిన ఎంపీడీవోలను మళ్లీ వారు పనిచేసిన స్థానాలకే ప్రభుత్వం పంపిస్తుండడంతో ఆయన రిలీవ్ అయ్యారని, మండలానికి ఆయన అందించిన సేవలు అభినందనీయమన్నారు. తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలని ఎంపీడీవో తెలిపారు.

వంగర: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాల్మాన్‌రాజ్‌ను ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, సిబ్బంది సత్కరించారు. అనంతరం ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఏవో లోపింటి త్రినాథ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఈశ్వరమ్మను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో అక్కారావు, సిబ్బంది మంగళవారం సత్కరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చిన ఆమె ఇప్పుడు బదిలీపై శ్రీకాకుళం వెళ్లడంతో ఆమెను సన్మానించినట్లు సిబ్బంది తెలిపారు. తనకు విధి నిర్వహణలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలని ఎంపీడీవో అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతి, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములనాయుడు, ఏపీవో త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలు



వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి



రేగిడి: చిన్నకోడిశ పాఠశాలలో లెమన్ స్పూన్ ఆట ఆడుతున్న విద్యార్థులు

తెర్లాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ తెలిపారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని చిన్నకోడిశ పాఠశాలను ఎంఈవో ఎంపీ ప్రసాదరావు సందర్శించి, అక్కడి విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలను పరిశీలించారు.